క్లుప్తంగా

ఈసెట్ కౌన్సెలింగ్‌కు 248మంది హాజరు



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న టీఎస్ ఈసెట్–2025 కౌన్సెలింగ్‌కు బుధవారం 248 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి, వారికి తగిన సూచనలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

భీమారం: మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం కొత్తగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో గోపాల్‌రావు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాండూర్: నీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ కొత్తగుడిసెలు కాలనీవాసులు రోడ్డెక్కారు. బుధవారం ఖాళీ బిందెలతో తాండూర్–భీమిని రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ కాలనీకి నీరు సరఫరా చేసే మోటారు చెడిపోయి వారం రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నీటి సమస్య తీవ్రతపై అధికారులను అడిగితే గ్రామ పంచాయతీలో డబ్బులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. మాజీ ఎంపీపీ శంకర్ మహిళలతో మాట్లాడారు. సాయంత్రంలోగా బోరు మరమ్మతు చేయిస్తానని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు. అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.


యువత రాజకీయాల్లో ముందుండాలి

తాండూర్: యువత రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సమావేశానికి వెళ్తున్న ఆయనకు బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ఆధ్వర్యంలో స్థానిక యువకులు శివచరణ్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తాండూర్‌లో ఇండోర్ స్టేడియం మంజూరుకు కృషి చేయాలని యువకులు శివచరణ్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు పెట్టెం విష్ణు కల్యాణ్, నాయకులు కొండగొర్ల అంజి, మంతెన శివప్రసాద్, శ్రీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు తనిఖీ

జన్నారం: రోడ్డు నిబంధనల ప్రకారం బస్సుకు సంబంధించిన అన్ని కాగితాలు కలిగి ఉండి, నిబంధనల ప్రకారమే స్కూలు బస్సు లు నడిపించాలని ఎస్సై గొల్లపెల్లి అనూష అన్నారు. మండలకేంద్రంలోని పలు పాఠశాలల బస్సులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. బస్సుల్లో ఫైర్‌సేఫ్టీ కిట్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, బస్సు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్, ఆర్సీ, తదితర కాగితాలను పరిశీలించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి



వస్తువులు కొనుగోలు చేస్తున్న కమిషనర్

మందమర్రిరూరల్: మెప్మా స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు జీవనోపాధి లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మందమర్రి మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో తయారు చేసిన ఉత్పత్తుల స్టాళ్లను మున్సిపల్ కమిషనర్ మెప్మా టీఎంసీ రఘురాంతో కలిసి ప్రారంభించారు.ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. బ్యాంకుల మేనేజర్లు, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

మురుగు బాధ తొలగింది

సాక్షి ఎఫెక్ట్..



భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామపంచాయతీ పరిధిలోని నేరేడుపల్లిలో మురుగు నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తుండంతో దుర్గంధం వెదజల్లుతోందని, ప్రజలు అవస్థలు పడుతున్నారని ‘రోడ్డుపై మురుగు’ అనే శీర్షికన బుధవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. రోడ్డు పక్క నుంచి తాత్కాలిక కాలువ ఏర్పాటు చేసి మురుగునీటిని తరలించారు. ఇన్నాళ్లు దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడ్డామని, ఆ నీటిని తరలించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన ‘సాక్షి’కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగునీటి కుంటతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని బుధవారం ‘సాక్షి’లో ‘మురుగు నీటి కుంట–దుర్వాసనతో తంట’ అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా ఎంపీవో అక్తర్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సమ్మయ్యకు ఆదేశాలు జారీ చేయడంతో వెంటనే మురుగునీటి కుంటను ఇసుకతో పూడ్చివేసి చదును చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేసి ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

రక్షణ చర్యలతో వ్యాధి నివారణ సులువు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బెల్లంపల్లిరూరల్: ముందస్తు రక్షణ చర్యలు పాటించడంతోనే క్షయవ్యాధి నివారణ సులభతరం అవుతుందని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సుధాకర్‌నాయక్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీలో టి.బి ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా బుధవారం వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరపి లేకుండా దగ్గు వస్తే సమీప పీహెచ్‌సీల్లో, ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉచితంగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి భారిన పడిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిచడంతో పాటు రూ.1000చొప్పున ప్రతి నెలా పోషణ భత్యం అందిస్తోందని సూచించారు. బలహీనంగా ఉన్న వారిలో, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని తెలిపారు. మద్యం సేవించడం, పొగాకు నమిలే వారికి త్వరగా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి పోషక ఆహారం తీసుకుని, రక్షణ చర్యలు పాటిస్తే వ్యాధి దరిచేరకుండా జాగ్రత్తగా ఉండవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సుచరిత, సహన, సౌజన్య, రామకృష్ణ, శిరీష, ఎన్‌పీహెచ్‌సీపీ జిల్లా ఇన్‌చార్జి మధుబాబు, సూపర్‌వైజర్ శశికాంత్, సిబ్బంది వెంకటేశ్, జగన్, శ్రీలత, సంతోష్, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కబ్జా!



ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణం

- నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఏకంగా భవన నిర్మాణ పనులు చేపడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలో భూ కబ్జాదారులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. నస్పూర్ గేట్ చౌరస్తా నుంచి మున్సిపాలిటీకి వెళ్లే దారిలో బీఆర్‌ఎస్ భవనం సమీపంలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లో ఉన్న సుమారు ఆరు గుంటల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు 43సర్వే నంబర్‌పై ప్రైవేటు భూమిగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారు. ఆ భూమి చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మించి, భూ కబ్జాకు పాల్పడగా సంబంధిత అధికారులు కంపౌండ్ వాల్‌ను తొలగించారు. కొద్ది రోజుల తర్వాత అదే స్థలంలో మూడు బోర్లు వేయడానికి ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టగా, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. పట్టణంలోని సుమారు రూ.కోటి విలువ చేసే ఆరు గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే సంబంధిత అధికారులు, తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సర్వే నంబర్ 42 ప్రభుత్వ భూమి అని గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన రిపోర్టు మ్యాప్

మారుతున్న హద్దులు..

పట్టణ పరిధిలోని పలు శాఖలకు చెందిన అధికారులు మారినప్పుడల్లా, ప్రభుత్వ భూముల హద్దులు మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 43లో గ్రామపంచాయతీ లే అవుట్ వెంచర్ కోసం 2017లో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన భూమి హద్దులు కాదని, స్థానిక అధికారులు మళ్లీ సర్వే చేసి వారికి ఇష్టం వచ్చినట్లుగా ప్రభుత్వ భూముల హద్దులు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఆ భూములు మళ్లీ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ సంతోష్‌ను సంప్రదించగా.. ఆ భూమి సర్వే నంబర్ 43 ప్రైవేటు భూమిగా తమ సిబ్బంది సర్వేలో తేలిందన్నారు. గతంలో మాకు వచ్చిన ఫిర్యాదు మేరకు మేము బోర్లు వేయడాన్ని నిలిపివేశామన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన నివేదికపై తనకు సమాచారం లేదని తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే తమకు ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్‌ను సంప్రదించగా.. తాము ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

జిల్లా వెటర్నరీ ఫోరం కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా పశుసంవర్ధక శాఖ వెటర్నరీ ఫోరం(టీఎన్జీవోస్) జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం గుడిపేట జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించారు. వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేశ్, టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు టి.తిరుపతి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ శంకర్ సమక్షంలో ఎన్నిక నిర్వహించి కార్యవర్గాన్ని ప్రకటించారు. వెటర్నరీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి అభిషేక్ రెడ్డి, సహ అధ్యక్షుడు రతన్, కోశాధికారి సుధాకర్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం..

వెటర్నరీ ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా ఎం.విజయ భారతి, సహ అధ్యక్షురాలుగా ఎం.ఇందిర, ఉపాధ్యక్షులుగా ఖాలిక్‌అంజుమ్, కృష్ణవేణి, తిరుపతి, సంతోష్, శ్రావణ్, కార్యదర్శిగా ఎం.గంగమల్లు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, శృతిలయ, సోనియా, లాయక్‌అలీ, స్వప్న, కోశాధికారిగా సత్యం, కార్యనిర్వాహక అధ్యక్షుడు రవళి, ప్రచార కార్యదర్శిగా పి.ప్రభుకుమార్, కార్యవర్గ సభ్యులుగా శైలేందర్, శిరీష, నరేశ్ ఎన్నికయ్యారు.



జిల్లా కార్యవర్గంలో టీఎన్జీఓస్, పశుసంవర్ధక శాఖ అధికారులు

సమాచారం

మహాసభలు విజయవంతం చేయండి

దండేపల్లి/నస్పూర్/రామకృష్ణాపూర్/బెల్లంపల్లి రూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మంచిర్యాల జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ నాయకులు తెలిపారు. రామకృష్ణాపూర్, నస్పూర్, బెల్లంపల్లి, దండేపల్లి మండలాల్లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటం సాగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తూ పేద ప్రజలను ఆర్థిక దోపిడీ చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు చేపడుతూ అమాయకపు గిరిజనలు, నక్సలైట్లను చిత్ర హింసలకు గురి చేస్తూ హతమార్చడం చాలా దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శాంతి చర్చలు జరిపి ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డిలు హాజరవుతారని అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో రాష్ట్ర సమితి సభ్యులు ఎం వెంకటస్వామి, బి పూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఏ.రాజమౌళి, రామకృష్ణాపూర్‌లో పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, నక్క వెంకటస్వామి, సాంబయ్య, నస్పూర్‌లో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, దండేపల్లిలో మండల కార్యదర్శి పెరిక రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ

పాతమంచిర్యాల: జిల్లాలోని నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 20న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మధు, కో కన్వీనర్లు కే.వెంకటస్వామి, సత్యగౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ మహాసభలో జాతీయ, రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లాలో సంఘం నిర్మాణం, జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై చర్చా, భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. జిల్లాలలోని జర్నలిస్టులు, ఫెడరేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు భాస్కర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

22న ఓబీసీల ‘పోరుబాట’ పుస్తకావిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలోని హోటల్ నార్త్ ఇన్‌లో ఈ నెల 22న ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, అడ్వకేట్ పృథ్వీరాజ్ సింగ్ పరమార్ రచించిన ఓబీసీల పోరుబాట పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జన అధికార సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాస్, భావనారుషీ ఒక ప్రకటనలో తెలిపారు.

సామగ్రి విక్రయానికి వేలం

చెన్నూర్: చెన్నూర్ మదన పోచమ్మ ఆలయం ప్రాంగణంలో కొబ్బరికాయలు, శీతల పానియాలు, క్రీడా సామగ్రి, ఆట వస్తువులు విక్రయ హక్కులు పొందేందుకు ఈ నెల 20న మధ్యాహ్నం 12గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేల డిపాజిట్ చెల్లించాలని కోరారు.

నీటి సమస్యలకు సత్వర పరిష్కారం

- మిషన్ భగీరథ ఎస్ఈ రవీందర్

తాండూర్: మండలంలో నెలకొన్న నీటి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపేడుతున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ రవీందర్ అన్నారు. మండలంలోని తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ కొత్తగుడిసెలులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో తలెత్తిన సమస్యను బుధవారం ఆయన పరిశీలించారు. మరమ్మతు పనులు జరుగుతున్న తీరును స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి, నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్ఈ వెంట మిషన్‌భగీరథ డీఈఈ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ రవీందర్, నాయకులు

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

తాండూర్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలను మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాధికారి మల్లేశం ప్రారంభించారు. మొత్తం 32మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఏడుగురు విద్యార్థినులు, పది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో తాండూర్, అచ్చలాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉమాదేవి, పీడీలు సాంబమూర్తి, సంతోష్ కుమార్, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో స్పందన కరువు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలకు విద్యార్థుల నుంచి స్పందన కరువైంది. ముగ్గురు విద్యార్థులు హాజరు కాగా, ఒక్కరు కూడా ఎంపిక కాలేదని మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి, పీడీ ఫణిరాజా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో మల్లేశం

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన

మంచిర్యాలటౌన్: ప్రపంచ సికిల్‌సెల్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సికిల్ సెల్ వ్యాధిపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 94మంది సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నారని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండేలా, పలు కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు.

అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

జన్నారం: ఓ అమ్మాయితో ఎంగేజ్మెంట్ చేసుకొని, పలుకారణాలతో రద్దు అయింది. కాగా ఆ అమ్మాయితో చనువుగా దిగిన ఫొటోలతో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం, బుట్టాపూర్‌కు చెందిన పోతుగంటి వినయ్‌పై బుధవారం అమ్మాయి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

తాండూర్/భీమిని: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. భీమిని మండలంలోని తంగల్లపల్లి, కన్నెపెల్లి మండలంలోని జన్కాపూర్‌లో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పాల్గొని దరఖాస్తులు పరిశీలించారు. భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాండూర్‌లో 261, అంకెపల్లి గ్రామంలో 54దరఖాస్తులు మొత్తం 315దరఖాస్తులు వచ్చాయి.

బొగ్గుబాయి వార్తలు

యోగా సాధన చేసిన ఉద్యోగులు



యోగా చేస్తున్న జీఎం కార్యాలయ సిబ్బంది

నస్పూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయ ఉద్యోగులు ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో యోగా సాధన చేశారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, స్టాటా కంట్రోల్ అధికారి అమర్నాథ్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, యోగా గురువు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

మందమర్రిరూరల్: ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన రూ.40వేల కోట్ల బకాయిలను సింగరేణి సంస్థ తక్షణమే వసూలు చేయాలని హెచ్‌ఎమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ ఆఫీస్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలు వసూలు చేయకుంటే సంస్థకు మనుగడ లేదని, కొత్త గనులకు పెట్టుబడులు కూడా లేక సింగరేణి భవిష్యత్ అందకారం అవుతుందన్నారు. ఆయన వెంట నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామస్వామి, గట్టయ్య, సంతోష్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మందమర్రిరూరల్: మంచిర్యాలలోని సీబీఎస్సీ పాఠశాలల్లో చదువుకునే రామకృష్ణాపూర్‌లోని కార్మికుల పిల్లలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఏరియా జీఎం దేవేందర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఆయన వెంట నాయకులు తన్వీర్‌హుస్సేన్, షఫియుద్దీన్ ఉన్నారు.

అధికారులకు సన్మానం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన డీవైజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఐఈడీ ఇంజినీరు రాజన్న, సేఫ్టీ ఆఫీసర్ విజయ్‌కుమార్‌ను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత



ఉద్యోగులతో జీఎం శ్రీనివాస్

నస్పూర్: సింగరేణి సంస్థలో నూతనంగా ఉద్యోగాల్లో చేరుతున్న ఉద్యోగులు క్రమశిక్షణతో ఉద్యోగాలు నిర్వహిస్తూ ముందుకు సాగాలని జీఎం శ్రీనివాస్ సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకాలు పొందిన 25మంది యువతీ, యువకులకు జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, సీనియర్ పీవో కాంతారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మూసివేసిన గనులు పునః ప్రారంభించాలి

చెన్నూర్: చెన్నూర్ ప్రాంతంలో మూసివేసిన సింగరేణి గనులను పునః ప్రారంభించి, ఈ ప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామగుడు లక్ష్మణ్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో పార్టీ జెండాను ఎగురవేసి సీపీఐ 8వ మండల మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. రాబోయే రోజు ల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఐ ఆధ్వర్యంలో కార్యాచరణ తీర్మానం చేపడుతామన్నారు. మ హాసభల్లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, చెన్నూర్ మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌల్, సుంకరి చందు, నాయకులు పాల్గొన్నారు.